సాక్షి తిరుపతి

ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



డిగ్రీ డీలా!

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ కళాశాలల్లో నోటిఫికేషన్ జాప్యంతో అడ్మిషన్లు అంతంత మాత్రమే వచ్చాయి. - 8లో



శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ

తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో శనివారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ నిర్వహించారు. - 8లో



జాతరకూ గుంతల రోడ్లే

జాతరకూ వెంకటగిరి-గూడూరు రోడ్డు గుంతలమయంగానే ఉంది. కలెక్టర్ మరమ్మతులు చేయాలని ఆదేశించినా మార్పు రాలేదు. - 8లో

నకిలీ వైద్యానికి తాళం!

అమాయక రోగులను ఆకర్షిస్తారు. వచ్చీరాని వైద్యం చేస్తూ అడ్డగోలుగా దోచేస్తారు. అరకొర అవగాహనతో అబార్షన్ల నుంచి.. ప్రసవాలదాకా చేసేస్తారు. జాయింట్లకు కూడా వీళ్లే సూదులు పొడిచేస్తారు. ఇబ్బడిముబ్బడిగా యాంటీబయాటిక్స్, సెలైన్లు రాసేస్తారు. అవసరం లేకపోయినా స్టెరాయిడ్లు, ఓవర్ డోసులు రాసేస్తారు. పశువుల ఆస్పత్రిగా బోర్డులు పెట్టి మనుషులకూ చికిత్సలు ప్రారంభిస్తారు.. కేవలం ప్రథమ చికిత్స చేయాల్సింది పోయి.. ఎంబీబీఎస్ డాక్టర్లుగా వ్యవహరిస్తూ గ్రామీణ రోగులను ఆకర్షిస్తారు.. ఇంతకీ వీరంతా ఎవరనుకుంటున్నారా..? అదేనండీ మన జిల్లాలో పాతుకుపోయిన ఆర్ఎంపీలు, పీఎంపీలు. వీరి భరతం పట్టేందుకు కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్యారోగ్యశాఖ సిద్ధమైంది. శనివారం ఏకంగా 141 క్లినిక్‌లను తనిఖీ చేసి, అందులో 43 క్లినిక్‌లను సీజ్‌చేసింది. నకిలీ వైద్యానికి.. శంకర్‌దాదా ఎంబీబీఎస్‌లకు ముకుతాడు వేసింది. అందుబాలో బయటపడ్డ వాస్తవాలు చూస్తే ముక్కున వేలేసుకోవాల్సి వస్తోంది.

- జిల్లాలో మితిమీరిన ఆర్ఎంపీలు, పీఎంపీలు
- బోగస్ సర్టిఫికెట్లతో పుట్టగొడుగుల్లా క్లినిక్‌లు
- పశువైద్యం పేరుతో మనుషులకూ వైద్యం
- వైద్య ఆరోగ్యశాఖ తనిఖీల్లో నకిలీల గుట్టు రట్టు
- 43 క్లినిక్‌ల సీజ్
- తాళం ఇవ్వాలని అధికారులపై కూటమి నేతల ఒత్తిళ్లు





ఆర్ఎంపీ క్లినిక్‌లో అధికారుల తనిఖీలు

43 క్లినిక్‌లకు తాళం

కలెక్టర్ ఆదేశాలతో 141 ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లపై దాడులు నిర్వహించారు. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 43 క్లినిక్‌లను అధికారులు సీజ్ చేశారు. అయితే చిత్తూరు, నగరి ప్రాంతాల్లోనే అధికంగా తనిఖీ చేయగా.. అధికంగా క్లినిక్‌లు ఉండే కుప్పం, పలమనేరు, జీడీనెల్లూరులో తూతుమంత్రంగా చేపట్టడం వెనుక ఆంతర్యమేమిటో అంతుపట్టడం లేదు. పుంగనూరులో అయితే అసలు తనిఖీలే చేయలేదు.



అధికారులు స్వాధీనం చేసుకున్న పత్రం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో 2వేల వరకు ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లున్నాయి. కాంపౌండర్లు, మందుల దుకాణాల్లో పనిచేసిన వ్యక్తులు, ఇతర ఉద్యోగాలు చేస్తూ సంపాదించాలనే ఆలోచనతో ఉన్న వ్యక్తులు ఈ ఆస్పత్రులను నెలకొల్పారు. అర్హత, అనుభవం లేని వైద్యులను తీసుకొచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో క్లినిక్‌లు నిర్వహిస్తూ..అక్కడి నిబంధనలతో జిల్లా సరిహద్దులో పాగా వేశారు. కుప్పం, వీ.కోట, పలమనేరు, యాదమరి, గుడిపాల, చిత్తూరు, పుంగనూరు, ఎస్ఆర్‌పురం, నగరి, జీడీనెల్లూరు, పాలసముద్రం తదితర మండలాల్లో పాతుకుపోయారు. వీరు పల్లె రోగులను ఆకర్షిస్తూ.. ప్రథమ చికిత్స వదలి.. ఎంబీబీఎస్ వైద్యులుగా బోర్డులు పెట్టేస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో దాడులు

జిల్లాలో ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వారం క్రితం కలెక్టర్ దీనిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ మేరకు ఆ శాఖ అధికారులు ఏడు కమిటీలను నియమించారు. నియోజవర్గానికి ఒక ప్రోగ్రాం ఆఫీసర్, ఒక మండల వైద్యాధికారి, ఇద్దరు సూపర్‌వైజర్ల చొప్పున్న కమిటీలు వేశారు. వీరు రెండు రోజుల పాటు ఆరు నియోజకవర్గాల్లో దాడులు నిర్వహించారు.

అబార్షన్లకు కేంద్ర బిందువు

జిల్లాలో పలు ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లు అబార్షన్లకు కేంద్రబిందువుగా మారాయి. నకిలీ క్లినిక్‌ల్లో గుట్టు చప్పుడు కాకుండా అబార్షన్లు జరిగిపోతున్నాయి. ఇందుకు పలు ఆర్ఎంపీలు, పీఎంపీలు రూ.10 నుంచి రూ.20వేల వరకు ఫీజుగా వసూలు చేస్తున్నారు. అలాగే ప్రసవాలు చేస్తూ....ఎంబీబీఎస్ వైద్యులుగా వ్యవహరిస్తున్నారని తనిఖీలో అధికారులు గుర్తించారు.

నకిలీ వైద్యులకు..కూటమి నేతల అండ?

కొందరు నకిలీగాళ్లకు కూటమి నేతలు సహకరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కలెక్టర్ ఆదేశాలతో ఆర్ఎంపీల క్లినిక్‌లపై దాడులు చేపట్టిన అధికారులకు... నకిలీ ఆర్ఎంపీలు, పీఎంపీలు, కూటమి నేతలు నుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. వెంటనే తాళాలు ఇచ్చేయాలని అధికారులను ఆదేశించినట్టు సమాచారం. ఇక యాదమరి పీహెచ్‌సీలో పనిచేసే సిబ్బంది తన అనుమతి లేకుండా ఎలా తనిఖీ చేస్తారని ఓ ప్రోగ్రాం ఆఫీసర్‌పై చిందులేయడం విమర్శలకు తావిచ్చింది.

గుట్టు..రట్టు ఇలా!

- జిల్లాలోనే ఏపీ క్లినిక్ కేర్ ఎస్టాబ్లిస్‌మెంట్ యాక్ట్ ప్రకారం ఏ ఒక్క ఆర్ఎంపీకి, పీఎంపీకి రిజిస్ట్రేషన్ లేదు.
- ఆర్ఎంపీ, పీఎంపీలుగా గుర్తింపు పొందినట్లు నకిలీ సర్టిఫికెట్లు ఉన్నవాటిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
- అసోసియేషన్ల ద్వారా సభ్యులుగా పత్రాలు పెట్టుకుని ఆర్ఎంపీలు, పీఎంపీలుగా చెలామణి అవుతున్నారని, ఇందుకు తిరుపతి, ఐరాల, పెద్దపంజాణి, నగరి, పలమనేరు ప్రాంతాల్లో రూ.10వేలు ఇచ్చి అసోసియేషన్‌లో సభ్యులుగా చేరుతూ... పత్రాలు తెచ్చుకుని క్లినిక్‌లు నడుపుతున్నారని అధికారులు గుర్తించారు.
- నిబంధనలకు విరుద్ధంగా మందులు, మాత్రలు ఇస్తున్నారని, యాంటిబయోటిక్ ఇంజక్షన్‌లు, స్టెరాయిడ్స్ విచ్చలవిడిగా ఇస్తున్నారని తనిఖీల్లో తెలుసుకున్నారు. వీళ్లే మందులు, మాత్రల సరఫరా, విక్రయాలు కూడా చేస్తున్నట్టు గుర్తించారు. వీటిని చాలా వరకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
- సెలైన్లు ఎక్కించడం, రక్త పరీక్షలు చేయడం, కుట్లు వేయడం, మోకాళ్లల్లో ఇంజెక్షన్‌లు ఇవ్వడం, బెడ్లు ఏర్పాట్లు చేసుకుని చికిత్స అందించడం, గర్భవతులకు, చిన్న పిల్లలకు వైద్యం చేయడాన్ని గుర్తించారు.
- చిత్తూరు నగరం పెనుమూరు క్రాస్‌లోని పశువుల ఆస్పత్రిగా బోర్డుపెట్టుకుని మనుషులకు చికిత్స చేస్తున్నట్లు గుర్తించారు.

జిల్లాలో తనిఖీలు, సీజ్ చేసిన క్లినిక్‌ల వివరాలు

నియోజకవర్గం	తనిఖీలు చేసిన క్లినిక్‌ల సంఖ్య	సీజ్‌చేసిన క్లినిక్‌ల సంఖ్య
చిత్తూరు	40	10
నగరి	41	19
పలమనేరు	05	02
జీడీనెల్లూరు	09	03
కుప్పం	07	04
పూతలపట్టు	15	05
పుంగనూరు	0	0

ప్రసవాల సంఖ్య

నెల	మగ పిల్లలు	ఆడ పిల్లలు
జూన్	1,359	1,102
జూలై	1,181	1,030
ఆగష్టు	1,194	1,038
మొత్తం	3,734	3,170

ఉక్కుపాదం మోపుతాం



ఆర్ఎంపీలు, పీఎంపీలే యాంటీబయోటిక్ మందులు, మాత్రలు, సరఫరా చేస్తున్నారు. వీళ్లే చికిత్సలు చేస్తున్నారు. జాయింట్‌లకు కూడా సూదులు వేస్తున్నారు. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు అనధికారిక క్లినిక్‌లపై తనిఖీలు చేస్తున్నాం. ఇప్పటి వరకు వందకు పైగా క్లినిక్‌లను తనిఖీ చేస్తే 43 దాకా సీజ్ చేశాం. వాటి వివరాలను రాష్ట్ర స్థాయి అధికారులకు పంపుతున్నాం. వారి ఆదేశాలతో తదుపరి చర్యలు ఉంటాయి. నకిలీ వైద్యంపై ఉక్కుపాదం మోపుతాం. వదలిపెట్టే ప్రసక్తే లేదు.

– డాక్టర్ సుధారాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

న్యూస్‌రీల్

క్రీడలతో మానసికోల్లాసం



కలెక్టర్, ఎస్వీయూ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : శారీరక , మానసిక ఉల్లాసానికి క్రీడలు అత్యవసరమని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ ఆధ్వర్యంలో ఎస్వీయూ స్టేడియంలో శనివారం జరిగిన మెగా కార్పొరేట్ క్రికెట్ లీగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుతో కలిసి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ ప్రభుత్వ ఉద్యోగులలో స్నేహ భావం కల్పించడంతో పాటు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్య సంరక్షణకు ఇలాంటి క్రీడలు అవసరమన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జట్టుతో పాటు టీటీడీ ఉద్యోగులు జట్టు, ఎస్వీయూ ఉద్యోగుల జట్టు, మున్సిపల్, పంచాయతీరాజ్, ఎస్వీయూ, అమరరాజ జట్లు క్రికెట్ పోటీలలో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మురళి, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీ ముత్తు, టీటీడీ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సెక్రటరీ నారాయణ, ఆర్గనైజర్ యుగంధర్, చంద్రు, 12 జట్ల కెప్టెన్లు , క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రారంభ మ్యాచ్ కలెక్టర్ జట్టుకు, ఎస్వీయూ జట్ల మధ్య జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

పోలేరమ్మ జాతర కమిటీ ఏర్పాటు

వెంకటగిరిరూరల్ : ఈనెల 10,11వ తేదీల్లో జరగనున్న శ్రీ పోలేరమ్మతల్లి జాతరకు సంబంధించి జాతర కమిటీని పట్టణంలోని వీరయ్య కల్యాణ మండపంలో శనివారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కమిటీ సమావేశంలో ఆలయ ఈఓ శ్రీనివాసులరెడ్డి పాలవర్గం వర్గం పేర్లను చదివి వినిపించారు. మురళీకృష్ణ, చంద్రశేఖర్, శివప్రసాద్, టీవీ కృష్ణ, యామిని, జగదీశ్వరి, కలపాటి నాగమణి, రామారావు అనీల్, తిరుపతిరావు, మదనపల్లి సావిత్రమ్మ, సత్య కిరణ్మయి, ప్రసాద్‌తో కమిటీని ఏర్పాటు చేశారు.

అక్టోబర్ 6న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సమావేశం

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సమావేశాన్ని అక్టోబర్ 6న (సోమవారం) సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ విభాగానికి చెందిన తిరుపతి జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రతీత్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కమిటీ అధ్యక్షుడు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జనరల్ బాడీ మీటింగ్ ఉంటుందని వివరించారు.

గ్రహణం రోజున ముక్కంటికి ప్రత్యేక అభిషేకాలు

శ్రీకాళహస్తి : చంద్రగ్రహణం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేకమైన గ్రహణ కాల అభిషేకాలు నిర్వహిస్తారు. ఈనెలలో రెండు గ్రహణాలు రానున్నాయి. ఆదివారం పౌర్ణమి రోజున సంపూర్ణ చంద్ర గ్రహణం, 21న సూర్య గ్రహణం. ఈ రెండు భారత దేశంలో దర్శనమిస్తాయి. ఈ నేపథ్యంలో గ్రహణాలకు అతీతంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో శాంతి అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆదివారం చంద్రగ్రహణం రాత్రి 9.58 గంటలకు ప్రారంభమై 8వ తేదీ వేకువజామున 1.26 గంటలకు ముగుస్తుందని శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పండితులు వివరించారు. 7వ తేదీ రాత్రి 11.42 గంటలకు చంద్రుడు పూర్తిగా కనబడడని తెలిపారు. ముల్లోకాలను ఏలే ముక్కంటీశుడు తనకు అలంకరించే కవచంలో తొమ్మిది గ్రహాలను 27 నక్షత్రాలను పొందుపరుచుకున్నారు కాబట్టి ఆ స్వామికి శాంతి అభిషేకాలు నిర్వహిస్తారని తెలిపారు.

పలువురికి పదవులు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలువురికి పదవులు వరించాయి. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పలువురిని పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా(పార్లమెంటు) నియమించారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో వీరికి పదవులు కేటాయించినట్లు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం ప్రకటించింది. చిత్తూరు జిల్లాకు చెందిన దయాసాగర్‌రెడ్డికి నగరి, చంద్రగిరి, ఎం.కృష్ణమూర్తికి కుప్పం, పూతలపట్టు, వెంకట్‌రెడ్డియాదవ్‌కు పలమనేరు, చిత్తూరు, అనీషారెడ్డికి పుంగనూరు, మదనపల్లె, రాకేష్‌రెడ్డికి జీడీనెల్లూరు, తంబళ్లపల్లెను కేటాయించారు. తిరుపతి జిల్లాకు చెందిన బీరేంద్రవర్మకు గుడూరు, సూళ్లూరుపేట, ఓ.గిరిధర్‌రెడ్డికి శ్రీకాళహస్తి, తిరుపతి, కే.కల్పలతరెడ్డికి వెంకటగిరి, సత్యవేడును కేటాయించారు. వీరు పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ, సంబంధిత రీజనల్ కో-ఆర్డినేటర్లు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరించనున్నారు.

తిరుమలలో శాస్త్రోక్తంగా చక్రస్నానం

తిరుమల: అనంత పద్మనాభవ్రతం సందర్భంగా తిరుమలలో శనివారం ఉదయం శ్రీవారి పుష్కరిణిలో శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. అనంత పద్మనాభ వ్రతాన్ని ప్రతి ఏటా తిరుమలలో భాద్రపద శుక్ల చతుర్దశి నాడు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో ఉదయం పూజలు చేసిన తరువాత శ్రీ సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి శ్రీ వరాహ స్వామి ఆలయం చెంత ఉన్న స్వామివారి పుష్కరిణిలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకాలు చేశారు. అనంతరం చక్రస్నానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తున్న వేదపండితులు

ఆర్పీ చేతివాటం

- పొదుపు సొమ్ము స్వాహా
- మెప్మాలో బయటపడ్డ అవినీతి చేప
- రూ.91 లక్షలు కొట్టేసినట్లు ఆడిట్‌లో నిర్ధారణ
- శ్రీ దీపిక సమాఖ్యలో సభ్యుల అక్రమాలు వెలుగులోకి..

తిరుపతి తుడా : తిరుపతి మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ)లో ఆర్పీ అవినీతి తిమింగళం బాగోతం వెలుగులోకి వచ్చింది. శ్రీ దీపిక సమాఖ్య ఆర్పీ (రిసోర్స్ పర్సన్) రూ. 91 లక్షలు కాజేసినట్లు నిర్ధారణ అయ్యింది. ఆరోపణల నేపథ్యంలో శ్రీ దీపిక సమాఖ్య థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించారు. ఆడిట్లో రూ.91 లక్షల మేర డ్వాక్రా సంఘం సభ్యుల సొమ్మును మింగేసినట్లు నిరూపితమైంది. ఇదే సమాఖ్యలో కొంతమంది డ్వాక్రా సంఘం సభ్యులు సైతం చేతివాటం ప్రదర్శించి తోటి సభ్యులకు చెందిన రూ.91,054 దిగమింగేశారు.

ఆడిట్‌తో నిర్ధారణ

శ్రీ దీపిక సమాఖ్యలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలు ఆడిట్ ద్వారా వెలుగులోకి వచ్చాయి. ఆర్పీ నోహీరా డ్వాక్రా సంఘాల సొమ్మును కాజేసిందని అధికారులు నిర్ధారణకు వచ్చారు. దీపిక సమాఖ్యలో మొత్తం 46 సంఘాలు ఉన్నాయి. ఇందులో 34 సంఘాలకు ఆడిట్ నిర్వహించగా 22 సంఘాలలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని స్పష్టమైంది. 12 డ్వాక్రా సంఘాలకు సంబంధించి ఆడిట్ నిర్వహించేందుకు సభ్యులు అంగీకరించక పోవడంతో మరింత అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్పీఈ పరిధిలోని 46 సంఘాలలో ఆడిట్ చేపడితే నోహీరా అవినీతి బాగోతం మరింతగా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

పటిష్ట చర్యలు చేపట్టలేరా?

తిరుపతి మెప్మాలో అవినీతి తిమింగలాల బాగోతం వెలుగు చూస్తున్నా కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం అవుతున్నారు. గతంలో చర్యలు చేపట్టకపోవడంతో అవినీతి ఆర్పీలు పెట్రేగిపోతున్నారు. అక్రమాలకు పాల్పడ్డారని ఆధారాలతో సహా పట్టుబడినా వారి నుంచి రికవరీ చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. ఇలాంటి అవినీతి ఆర్పీల భరతం పట్టేలా చర్యలు తీసుకోకుంటే సంఘ సభ్యుల నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉంది.

సంఘాల వారీగా ఆర్పీ నోహిరా నొక్కేసిన సొమ్ము ఇలా..

సంఘం పేరు	కాజేసిన మొత్తం (లక్షల్లో)
గాయత్రి	7,36,700
శ్రీసాయి	5,40,000
అలిమేలు మంగమ్మ	12,66,5030
సేవ జననీ	9,52,775
విజయదుర్గ	4,71,234
తిరుమల దేవి	6,51,553
అమ్మ	2,50,000
లక్ష్మీ దేవి	2, 44,080
శ్రీనివాస	6,15,695
జాన్సీరాణి	7,000
శ్రీవినాయక	6,04,100
శ్రీవల్లి	3,054
శ్రీ వెంకటేశ్వర	4,36,500
గంగమ్మ	75,000
సరోజినీదేవి	4, 63,000
మీనాక్షి	5,33,545
మూలస్థానమ్మ	2,43,259
విజయలక్ష్మి	1,71,000
రెడ్డెమ్మ	5,38,500
గౌతమ్	2,83,162
శ్రీధన లక్ష్మి	6000
చక్రధారి	76,331
మొత్తం	రూ. 91,63,018

మెడికల్ కళాశాలలపై కూటమి నిర్లక్ష్యం




సమావేశమైన విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

- జగనన్న ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలు మంజూరు
- వాటిని ఎందుకు ఎందుకు ప్రారంభించలేదు ?
- పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసిన దుర్మార్గుడు బాబు
- ప్రశ్నించిన విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : మెడికల్ కళాశాలలపై కూటమి ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చూపుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ప్రశ్నించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మల గుంటలోని పార్టీ కార్యాలయంలో శనివారం మెడికల్ కాలేజీలపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై పోరాడేందుకు శనివారం విద్యార్థి సంఘం నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వంలో మొత్తం 17 మెడికల్ కళాశాలల్లో 5 ప్రారంభం కాగా మరో 7 కాలేజీలు ఎన్నికలు జరిగే సమయానికి అన్ని పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆ తరువాత మరో 5 కాలేజీలను ప్రారంభించాల్సిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా దృష్టిపెట్టక పోవడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మొత్తం 12 మెడికల్ కాలేజీల్లో విద్యార్థులు సీట్లు కోల్పోవాల్సి వచ్చిందని ఆరోపించారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. జగనన్న ప్రభుత్వం చేసిన మంచిని బయటకు కనబడకుండా చేయడానికి పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు రాకుండా చేశారని ఆరోపించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 2360 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా జగనన్న ప్రభుత్వంలో తెచ్చిన 12 కొత్త మెడికల్ కాలేజీల ద్వారా 2550 సీట్లు పెరిగేవన్నారు. వైద్య విద్యలో ప్రభుత్వం పేద విద్యార్థులకు చేసిన మోసాన్ని బయట పెట్టడానికి త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేయనున్నట్టు వివరించారు. సమావేశంలో విద్యార్థి విభాగం నేతలు ఓబుల్ రెడ్డి, చెంగల్ రెడ్డి, గూడూరు రఫీ, యశ్వంత్ రెడ్డి, వినోద్ కుమార్, నక్క హరినాథ్, హరీష్, భానుప్రకాష్‌రెడ్డి, నరేశ్, వెంకట రమణ నాయక్, శేషారెడ్డి, రెడ్డి నాయక్ , కరుణాకర్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై జాతీయ సదస్సు

- ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహణ
- సదస్సుకు లోకసభ స్పీకర్, గవర్నర్, సీఎం రాక
- సదస్సును విజయవంతం చేద్దాం : కలెక్టర్



తిరుచానూరులోని రాహుల్ కన్వెన్షన్ హాల్ వద్ద పరిశీలిస్తున్న ప్రసన్నకుమార్, కలెక్టర్, ఎస్పీ



చంద్రగిరి కోటను పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్ : తిరుపతి వేదికగా మహిళా సాధికారత జాతీయ సదస్సును చేపట్టనున్న నేపథ్యంలో సమష్టిగా విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈనెల 14, 15 తేదీల్లో తిరుచానూరులోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో సదస్సు ఉంటుందని వెల్లడించారు. ఆ మేరకు ఏపీ లెజిస్లేటివ్ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్‌తో పాటు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్యతో కలిసి కలెక్టర్ శనివారం పరిశీలన చేపట్టారు. ముందుగా సదస్సు చేపట్టనున్న రాహుల్ కన్వెన్షన్ హాల్‌తో పాటు చంద్రగిరి కోటను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సదస్సుకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి జాతీయ మహిళా సాధికారిత కమిటీ సభ్యులు రానున్నారని చెప్పారు. ప్రధానంగా లోకసభ, శాసన సభ స్పీకర్లు, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు , ఇతర ప్రముఖులు రానున్నారని స్పష్టం చేశారు. చంద్రగిరి కోటను అన్ని హంగులతో సిద్ధం చేయాలని ఆదేశించారు. కోటలో సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యూజిక్ లైట్ అండ్ సౌండ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే చంద్రగిరి కోటకు చేరుకునే మార్గంలో అప్రోచ్ రోడ్లు, తదితర ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ నరసింహులు, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, ప్రొటోకాల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివశంకర్ నాయక్, అడిషినల్ ఎస్పీ రవిమనోహరాచారి, డీపీఓ సుశీలాదేవి, తిరుపతి, చంద్రగిరి డీఎస్పీలు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్ నాయుడు, టూరిజం ఆర్డీ రమణ ప్రసాద్, గురుస్వామి శెట్టి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ డీలా!

- ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ప్రవేశాలు అంతంతే!
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 30 శాతం దాటని దరఖాస్తులు
- ఉన్నత విద్యామండలి నిర్వాకమే కారణమంటున్న విద్యావేత్తలు
- టీటీడీ విద్యాసంస్థలపై మొగ్గుచూపిన విద్యార్థులు
- నేడు సీట్ల కేటాయింపు.. రేపు కళాశాలలో రిపోర్టింగ్



తిరుపతి సిటీ : జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ డిగ్రీ కళాశాలల్లో 2025–26కు సంబంధించి ప్రవేశాలు నాలుగు నెలలు జాప్యం కావడంతో అడ్మిషన్ల దరఖాస్తులు కనీసం 40 శాతం కూడా దాటకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ఉన్నత విద్యామండలి దరఖాస్తుల గడువును మూడుసార్లు పొడిగించినా దరఖాస్తులు పెరగకపోవడంతో దిక్కుతోచని స్థితిలో కళాశాలల యాజమాన్యాలు తలలు పట్టుకుంటున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది 50 శాతానికి పైగా ప్రవేశాలు తగ్గుముఖం పట్టనున్నట్లు స్పష్టమైన సంకేతాలు రావడంతో ప్రైవేటు, ప్రభుత్వ కళాశాల పరిస్థితి దారుణంగా తయారైంది.

రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో పాటు ఈ ఏడాది డిగ్రీలో అడ్మిషన్లు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో కళాశాలలను ఎలా నడపాలో అర్థం కావడం లేదంటూ యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

టీటీడీ కళాశాలలపై తగ్గని ఆదరణ

డిగ్రీ ప్రవేశాల కోసం సుదీర్ఘ కాలం నిరీక్షించిన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల వైపు మొగ్గు చూపడం లేదు. జిల్లాలోని సుమారు 18 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కనీసం 30 శాతం దరఖాస్తులు రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అదే టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీడబ్ల్యూ, ఎస్వీ ఆర్ట్స్, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలల్లో 90 శాతానికి మించి దరఖాస్తులు రావడం గమనార్హం. అలాగే టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఓరియెంటల్, సికింద్రాబాద్ కళాశాలలో 25 శాతం కూడా దరఖాస్తులు రాకపోవడంతో ఆయా కళాశాలల యాజమాన్యాల పరిస్థితి అయోమయానికి గురిచేస్తోంది.

నోటిఫికేషన్ విడుదలలో జాప్యం

జిల్లాలో డిగ్రీ అడ్మిషన్ల కోసం నాలుగు నెలలుగా ఎదురు చూసిన విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నత విద్యామండలి నిర్ణయంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సింగిల్, డబుల్ మేజర్ సబ్జెక్ట్ విధానం అంటూ విద్యార్థులను తికమక పెట్టించి నాలుగు నెలల తర్వాత నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం విద్యా విధానాన్ని నిర్వీర్యం చేసిందని, కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాసేందుకే ఇలాంటి నిర్ణయాలను తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత విద్యామండలి నిర్ణయాన్ని మేధావులు విద్యావంతులు తప్పుపడుతున్నారు.

రూ.కోట్లలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

జిల్లాలోని ప్రైవేటు డిగ్రీ కళాశాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే పలు ప్రైవేటు డిగ్రీ యాజమాన్యాలు కళాశాలలను నడపలేని పరిస్థితికి చేరుకున్నాయి. రెండేళ్లుగా జిల్లాలో సుమారు రూ.650 కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ఒక్కో కళాశాలకు సుమారు రూ.కోటి నుంచి 2 కోట్ల వరకు చెల్లించాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో కళాశాలలను నడపలేని స్థితిలో యాజమాన్యాలు నరకయాతన పడుతున్నాయి. ఇందులో భాగంగా 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల ప్రవేశాలపై ప్రభావం పడనుంది. కనీసం 25శాతం సైతం అడ్మిషన్లు జరిగే పరిస్థితి లేదంటూ యాజమాన్యాలు వాపోతున్నాయి. డిగ్రీ ప్రైవేటు కళాశాల పరిస్థితి అయోమయంలో పడిందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

నేడు సీట్ల కేటాయింపు సంక్షిప్త సందేశాలు

ఎట్టకేలకు డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో ఆదివారం విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేయనున్నారు. ఈ మేరకు ఓఏఎండీసీ పోర్టల్ ఆధ్వర్యంలో రిజర్వేషన్ల, మెరిట్ ప్రాతిపదికన సీట్ల కేటాయింపు చేయనున్నారు. ఈ మేరకు ఆదివారం విద్యార్థుల మొబైల్ ఫోన్లకు సమాచారం అందించనున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలలో సోమవారం రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

జిల్లా సమాచారం

- జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు - 17
- అందుబాటులోని సీట్లు - 8950
- వచ్చిన దరఖాస్తులు - 2676
- ప్రైవేటు కళాశాలలు - 104
- అందుబాటులోని సీట్ల సంఖ్య - 38,680
- వచ్చిన దరఖాస్తులు - 13,191

టీటీడీ విద్యాసంస్థల వివరాలు

కళాశాల	అందుబాటులో ఉన్న సీట్లు	వచ్చిన దరఖాస్తులు
పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల	1550	1697
ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల	1068	1457
ఎస్వీ ఆర్ట్స్ కళాశాల	1417	1679
ఎస్వీ ఓరియెంటల్ కళాశాల	300	189
సికింద్రాబాద్ ఎస్వీవీవీఎస్	60	57

ఎప్పుడూ చూడలేదు..

"గ్రామీణ పేద విద్యార్థులు ఎంతో ఆశతో ఎదురు చూసిన డిగ్రీ అడ్మిషన్లు కూటమి ప్రభుత్వం సర్వనాశనం చేసింది. ఇంటర్ ఫలితాలు విడుదల చేసి నాలుగు నుంచి 5 నెలలు గడిచినా డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ కళాశాలలో కనీసం 20శాతం సైతం ప్రవేశాలు జరిగే పరిస్థితి లేదు. తిరుపతి నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న కళాశాలల్లో మాత్రమే కాస్త మెరుగ్గా దరఖాస్తులు వచ్చాయి. గతంలో ఏపీ చరిత్రలో డిగ్రీ అడ్మిషన్లపై ఇలాంటి పరిస్థితి చూడలేదు.

– ఎస్వీయూ పరిధిలోని డిగ్రీ రిటైర్డ్ అధ్యాపకుడు, తిరుపతి

క్లుప్తంగా

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు 23 చివరి గడువు

తిరుపతి సిటీ : 2026–27 విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయిలో 6వ, 9వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 23వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ.. విశ్వంలో నవోదయ ప్రవేశాలకు శిక్షణ పొందిన ఎంతో మంది 100 శాతం సీట్లు సాధించారని తెలిపారు. పోటీ పరీక్షలకు సంబంధించి మరిన్ని వివరాల కోసం 86888 88802 / 93999 76999 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు పెంచలకోన ఆలయం మూసివేత



రాపూరు : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆదివారం చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సోమవారం ఉదయం 9 గంటల వరకు ఆలయం మూసివేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. సోమవారం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, తదితర పూజా కార్యక్రమాల నిర్వహించిన అనంతరం భక్తులను అనుమతిస్తారని తెలిపారు. దేవస్థాన అధికారులతో భక్తులు సహకరించాలని కోరారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


సిద్ధయ్య మృతదేహం

బుచ్చినాయుడు కండ్రిగ : అప్పుల బాధ తాళలేక బుచ్చినాయుడు కండ్రిగకు చెందిన ఓ వ్యక్తి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని వీయస్‌పురం దళితవాడకు చెందిన సిద్ధయ్య (54)కు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. సిద్ధయ్య శ్రీకాళహస్తిలోని ఓ ఫ్యాక్టరీలో కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణ, పిల్లల చదువుల కోసం రూ.5 లక్షలు అప్పులయ్యాయి. ఈక్రమంలో అప్పుల బాధ తాళలేక శనివారం గ్రామంలోని పొలాల వద్దకు వెళ్లి పురుగుమందు తాగి స్పృహ తప్పిపడిపోయాడు. పక్క పొలాల్లో ఉన్న రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రుయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు.

శోత్రియ భూముల్లో ఆక్రమణలు చేపడితే జైలే


ఆక్రమణకు గురైన శోత్రియ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుధీర్ రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం : మండలంలోని చిన్న పాండూరు పంచాయతీ పాదిరి కుప్పం రెవెన్యూలోని శోత్రియ భూముల్లో ఆక్రమణలు చేపట్టడం, దుక్కి దున్నకాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మండల తహసీల్దార్ సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. ఇటీవల కొందరు అక్రమార్కులు కొద్ది రోజులుగా ట్రాక్టర్ల ద్వారా దుక్కి దున్నకాలు చేపడుతున్నారు. దీనిపై శనివారం శోత్రియ భూముల్లో దొంగలు పడ్డారు అనే కథనం సాక్షిలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తహసీల్దార్ సుధీర్ రెడ్డి శోత్రియ భూములు సందర్శించి అక్రమంగా చేపట్టిన దుక్కి దున్నకాలను పరిశీలించారు. తక్షణమే శోత్రియ భూముల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇకపై ఎవరైనా దుక్కి దున్నకాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అక్రమార్కులను హెచ్చరించారు. స్థానిక వీఆర్వో, వీఆర్ఏలను ఈ విషయమై గట్టిగా మందలించి చిన్నపాటి ఆక్రమణలు జరిగినా తన దృష్టికి తక్షణమే తీసుకురావాలని ఆదేశించారు. శోత్రియ భూములపై నిఘా ఉంచాలని సూచించారు. ఆయన వెంట వీఆర్వో చలపతి, విలేజ్ సర్వేయర్ రాఘవ ఉన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

- 35 గ్రాముల బంగారం, 350 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం


పట్టుబడిన అంతర్రాష్ట్ర దొంగ, బంగారు ఆభరణాలతో పోలీసులు

రేణిగుంట : గత పదేళ్లుగా వంద ఇళ్లలలో తాళాలు పగులగొట్టి దొంగతనాలు చేస్తున్న తమిళనాడుకు తుత్తుకూడి జిల్లాకు చెందిన తంగ ముత్తు అనే అంతర్రాష్ట్ర దొంగను గాజులమండ్యం పోలీసులు అరెస్టు చేసి 35 గ్రాముల బంగారు ఆభరణాలు, 350 గ్రాముల వెండి స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించారు. గాజుల మండ్యం పోలీస్ స్టేషన్‌లో శనివారం డీఎస్పీ శ్రీనివాసరావు విలేకరుల సమావేశాన్ని నిర్వహించి కేసు వివరాలను వెల్లడించారు. రేణిగుంట మండలంలో రాత్రిపూట తాళాలు పగులగొట్టి దొంగతనాలు చేసే వ్యక్తిని పట్టుకునే ఉద్దేశంతో నిఘా పెట్టి నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడిపై ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల్లో పలు కేసులు నమోదయ్యాయని తెలిపారు. తమిళనాడు ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారం మేరకు రూరల్ సీఐ మంజునాథరెడ్డి, ఎస్ఐ సుధాకర్ సిబ్బందితో వెళ్లి నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అంతర్రాష్ట్ర దొంగను పట్టివేతలో ప్రతిభ కనబరిచిన పోలీసులను అభినందించి నగదు రివార్డును అందించారు. సమావేశంలో సిబ్బంది గోపి, వేణుగోపాల్ , మణివాసు, రాజేష్, సుబ్రమణ్యం, మురళీ పాల్గొన్నారు.

కిటికీ పగులగొట్టి నగలు చోరీ

పాకాల : ఇంటిలో ఎవ్వరూ లేరని గ్రహించి గుర్తు తెలియని దుండగులు ఇంటి కిటికీ పగులగొట్టి నగలు అపహరించిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు శనివారం తెలిపిన వివరాల మేరకు.. మేడసాని ఇండ్లు గ్రామానికి చెందిన లక్ష్మయ్యనాయుడు తమ కుటుంబ సభ్యులతో కలసి రెండు రోజుల కిందట రొంపిచెర్లలోని తమ బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటి తాళాలు వేసి ఉండడాన్ని గమనించిన గుర్తు తెలియని దుండగులు ఇంటి కిటికీని పగులగొట్టి లోనికి ప్రవేశించి ఇంటిలో ఉన్న బీరువా తాళాలు తీసుకుని బీరువాలో ఉన్న 83 గ్రాముల బంగారు నగలను అపహరించారు. శనివారం ఇంటికి వచ్చిన లక్ష్మయ్యనాయుడు, దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సుదర్శన్ ప్రసాద్ కేసు నమోదు చేశారు.

కారు దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తిరుపతి క్రైమ్ : తిరుపతిలో శనివారం రాత్రి ఓ కారు పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుచానూరులో నివాసం ఉంటున్న కిరణ్ శనివారం రాత్రి తిరుపతి–కరకంబాడి రోడ్డులోని ఓ ఆస్పత్రికి తన కారులో బయలుదేరగా మార్గ మధ్యలో మంటలు చెలరేగాయి. అయితే కారును వదిలేసి ఆయన బయటకు వచ్చేశాడు. అయితే కారు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

గుజరాత్ యాత్రకు

ప్రత్యేక రైలు


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డైరెక్టర్, ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : రైల్వే శాఖలో భాగమైన ఐఆర్‌సీటీసీకి తొలి సారిగా పర్యాటక ప్రదేశాల సందర్శనార్థం 10 ప్రత్యేక రైళ్లు కేటాయించారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 7 నుంచి 10 రోజుల పాటు ప్రత్యేక పర్యాటక రైలు ద్వారా భవ్య గుజరాత్ యాత్రను నిర్వహించనున్నట్లు తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ వేణుగోపాల్ వెల్లడించారు. ఈ యాత్రలో గరిష్టంగా 639 మంది యాత్రికులు పాల్గొనవచ్చన్నారు. ద్వారక, నాగేశ్వర్ ఆలయం, సోమనాథ్ ఆలయం, అహ్మదాబాద్, సూర్య దేవాలయం, సబర్మతి ఆశ్రమం, సబర్మతి నదీ తీరం, యునెస్కో వారసత్వ స్థలం, అలాగే ప్రపంచ ప్రఖ్యాత స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వంటి పుణ్యక్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలను తిరుపతి, చిత్తూరు జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన యాత్రికులు సందర్శించే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రత్యేక పర్యాటక రైలు రేణిగుంట నుంచి గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్, నిజాముద్దీన్, హుజూర్ సాహెబ్ నాందేడ్, పూణే మార్గంలో ప్రయాణించి తిరిగి అదే మార్గం ద్వారా రేణిగుంట జంక్షన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులకు భోజనవసతి కల్పిస్తారన్నారు. స్లీపర్ ధర రూ. 18,400 కాగా 3 టైర్ ఏసీ ధర రూ. 30,200 కాగా 2టైర్ ఏసీ ధర రూ. 39,900గా నిర్ణయించినట్లు తెలిపారు. యాత్రికులు 92814 95853 , 82879 32313 నంబర్లను సంప్రదించాలని కోరారు.

శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ

- నేడు అమ్మవారి ఆలయం మూసివేత


అమ్మవారి గర్భాలయంపై పవిత్రాలను సమర్పిస్తున్న అర్చక స్వాములు

చంద్రగిరి : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ నిర్వహించారు. ఉదయం 11.30 గంటల నుంచి పవిత్ర సమర్పణ నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు యాగశాలలో ఆరాధన, హోమాలు, నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి తదితర వైదిక కార్యక్రమాలను చేపట్టారు. ఆదివారం ఉదయం 10.00 గంటల నుంచి 11.30 గంటల వరకు శ్రీకృష్ణస్వామి మఖ మండపంలో స్నపన తిరుమంజనం, చక్రస్నానం చేపట్టనున్నారు. అటు తర్వాత పలు వైదిక కార్యక్రమాల తర్వాత ఆదివారం చంద్రగ్రహణంలో భాగంగా మధ్యాహ్నం 02.15 గంటలకు ఆలయాన్ని మూసివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజు, ఆలయ అర్చకులు, సూపరింటెండెంట్ రమేశ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

జాతరకూ గుంతల రోడ్లే

- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- వెంకటగిరి జాతరకు లక్షల్లో రానున్న భక్తులు
- గుంతలమయంగా వెంకటగిరి–గూడూరు రోడ్డు


అధ్వాన్నంగా వెంకటగిరి- గూడూరు రహదారి

వెంకటగిరి (సైదాపురం) : రాష్ట్ర పండుగగా జరుగుతున్న వెంకటగిరి పోలేరమ్మ జాతరకు లక్షల మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తారు. ఈ క్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని నెల్లూరు, గూడూరు మీదుగా వెంకటగిరికి చేరుకుంటారు. ఈ నేపథ్యంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్న విషయాన్ని తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆ శాఖ అధికారులను రోడ్డు బాగు చేయాలని ఆదేశించారు. జాతర ఆదివారం ఘటోత్సవంతో ప్రారంభమై మరో మూడు రోజుల్లో ముగియనుంది. కాని రోడ్డు మరమ్మతులు మాత్రం మొక్కుబడిగా సాగుతున్నాయి. జాతర సమయంలో వేల మంది ఈ మార్గం గుండా ప్రయాణాలు సాగిస్తారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.